# రేడియో అక్కయ్యగారు

నా చిన్నతనంలో నాలాంటి వేలాదిమంది రేడియో అన్నయ్య, అక్కయ్యలకు అభిమానులం. మా యింట్లో రేడియో ఉండేది కాదు. పక్క యింటి శ్రేష్ఠి గారింట్లో రేడియోలో పిల్లల కార్యక్రమాన్ని- వారి యింటి అరుగు కిటికీ ఊచలకి వేలాడుతూ వినేవాడిని. శ్రవ్య మాధ్యమంలో- 'బొమ్మ'ని కళ్ళకి కట్టే ప్రక్రియని అంత సమగ్రంగా, సాకల్యంగా, సాధికారికంగా సాధించినవారు మరెవరూ లేరని చెప్పగలను. ముఖ్యంగా ఆకాశానికి నిచ్చెనలు వేసి, ఆలోచనలకు రెక్కలు విప్పుకునే పసివారి మనస్సుల్లో ఆ కార్యక్రమాలు అమృతవర్షం కురిపించేవి.

మరో పన్నెండు సంవత్సరాలకి నేను హైదరాబాదు ఆకాశవాణిలో చేరాను. అప్పటికి అన్నయ్యగారూ, అక్కయ్యగారూ రేడియోలో పనిచేస్తున్నారు. కాని యిదేమిటి! అక్కయ్యగారు మహిళా కార్యక్రమాల విభాగంలో వున్నారు? అని ఆశ్చర్యపోయాను. వారిల్లు- ఆంధ్రబాలానంద సంఘం- నారయణగూడాలో వుండేది. నేను బర్కత్‌పురాలో వుండేవాడిని. రోజూ రేడియో స్టేషన్‌కి నా స్కూటరుతో వారిని వెంబడిస్తూండేవాడిని. అనాటి హైదరాబాదు రిక్షాలలో మఠం వేసుక్కూచుని  చెరో రిక్షాలో ఆఫీసుకి వచ్చేవారు. ఎక్కువగా అక్కయ్యగారికి పిల్లల కార్యక్రమాల జోలికి రానిచ్చేవారుకాదు అన్నయ్యగారు. అందుకు కారణం కేవలం ఆమె ఆరోగ్యమే. కాని అక్కయ్యగారి మనస్సెప్పుడూ పిల్లల కార్యక్రమాల మీదే వుండేది. ఓసారి చిన్నపిల్లల కార్యక్రమాన్ని అన్నయ్యగారు నిర్వహిస్తున్నప్పుడు నేనూ, అక్కయ్యగారూ అనౌన్సరు బూత్‌లో వున్నాం. కార్యక్రమాన్ని చూసి ఆనందిస్తూనే ఉన్నట్టుండి కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు అక్కయ్యగారు. ''నన్ను ఈ కార్యక్రమాల వేపు రానివ్వరు- నా ఆరోగ్యాన్ని గురించి భయపడుతూ'' అన్నారు. ఆ కార్యక్రమాల పట్ల అమె ఆనారోగ్యం ఏ మాత్రం ముసుగు వెయ్యని సందర్భమది.

అక్కయ్యగారి మహిళా కార్యక్రమానికి ఎన్నో రచనలు చేసినా బాగా గుర్తున్నవి- గొప్ప ప్రచారాన్ని సాధించిన సీరియల్స్- రెండు. ముప్పాళ రంగనాయకమ్మగారి 'బలిపీఠం', యద్దనపూడి సులోచనారాణిగారి 'సెక్రటరీ'. మొదటి సీరియల్‌లో సులోచనారాణీ నటించారు. రెండింటిలోనూ శారాదా శ్రీనివాసనే ముఖ్య భూమిక. ఒక విధంగా ఆమె అక్కయ్యగారిని దన్నుగా నిలిచేవారు. బలిపీఠం ఆదివారం మధ్యాహ్నం మహిళా కార్యక్రమంలో ప్రసారమయేది. నేనెప్పుడూ డ్యూటీలో వుండేవాడిని. ప్రసారం అవుతూనే ఎవరో శ్రోతనుంచి ఫోన్ వచ్చేది- అక్కయ్యగారికి. ఆ ఫోన్‌లో మాట్లాడుతూనే అక్కయ్యగారు కళ్ళనీళ్ళు పెట్టుకునేవారు. బలిపీఠం ప్రసారానికీ

ఆ రోజుల్లో నిజజీవితానికి ఏదో లంకె వుండేది. ఏమయినా నేనూ, శారదా ఆమెని ఓదార్చేవాళ్ళం. అంత సున్నితమయిన హృదయం అక్కయ్యగారిది. ఆ రోజుల్లో బలిపీఠం మహిళా కార్యక్రమంలో ఓ చరిత్రగా చెప్పుకోవచ్చు.

ఓసారి అన్నయ్యగారు 'దంతవేదాంతం' నాటకంలో నా అల్లుడయారు. మరోసారి నా 'అనంతం'లో పోలీసు. అన్నిటికీ అక్కయ్యగారు ప్రేక్షకులు. ఆ రోజుల్లో నాకు ఒకటి రెండు 'దొంగ' బదిలీలు అయినప్పుడు– దంపతులు నన్ను వారింటికి పిలిచి విందు చేశారు. అన్నయ్యగారు ఓ పాట రాసి పాడారు. దాన్ని యివాళ మిగుల్చుకోలేకపోయాను.

వృత్తిగా మహిళా కార్యక్రమాలు నిర్వహించినా ఆమె మనస్సులో మొదటి తాంబూలం చిన్నపిల్లల కార్యక్రమానికే. అది ఆమె స్వభావంలో సరళత్వానికి మచ్చుతునక. ఆ కార్యక్రమాల్ని విని ఆనందించే మొదటి శ్రోత ఎప్పుడూ అక్కయ్యగారే.

దరిమిలాను నాకు హైదరాబాదు నుంచి విజయవాడ బదిలీ అయింది. 1968లో. ఆ తర్వాత వినడమేగాని– అన్నయ్యగారినీ, అక్కయ్యగారినీ మళ్ళీ కలుసుకునే అవకాశం రాలేదు.

వ్యక్తిగతమయిన ఆర్ద్రతనీ, అభిమానాన్నీ ఓ ఉద్యమంలాగ కొన్ని తరాల శ్రోతలకు పంచిన –అతి సమగ్రమయిన ప్రసార కర్తలుగా అన్నయ్యగారినీ, అక్కయ్యగారినీ నేను పేర్కొంటాను. ఇది మాధ్యమం పరంగా నేను చెప్పే మాట. వ్యక్తులుగా– పిల్లలు లేని ఆ దంపతుల కుటుంబం పెద్దది. గొప్పది. ఉన్నతమయినది. నిత్యనూతనమయినది. అందులో ఎందరో రచయితలు, కళాకారులూ, నటులూ, అధికారులూ, ఉద్యోగులూ– మరెందరికో చోటుంది.

ఓ వ్యక్తి స్మృతి నూరు సంవత్సరాలు సజీవంగా నిలవడానికి ఏం కావాలి? ఆ వ్యక్తి జీవితంలో జీవలక్షణం కావాలి. జీవుని వేదన కావాలి. నడవడికలో నిప్పులాంటి నిజాయితీ కావాలి.  అన్నిటికీ మించి గుండెలు నింపే ఆర్ద్రత కావాలి. వెరసి 'రేడియో అక్కయ్య' కావాలి.

★★★★★★ ★★★★★★★ ★★★★★★